ప్రజాశక్తి
శనివారం 17 ఫిబ్రవరి 2024
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

# సమ్మె విజయవంతం


విశాఖ నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

- విశాఖ, అనకాపల్లిల్లో ఎక్కడికక్కడ కార్మిక, కర్షకుల నిరసన ప్రదర్శనలు
- మోడీ సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలపై భగ్గు
- ప్రభుత్వ రంగ సంస్థల వద్ద ఆందోళనలు చేపట్టిన ఉద్యోగులు
- నిలిచిన లారీలు, హైర్ బస్సులు, రవాణా రంగం


అనకాపల్లిలో కార్మిక, కర్షకుల ర్యాలీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి, విలేకరులు

మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక విధానాలను వ్యతిరేకిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం జరిగిన పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ జయప్రదమైంది. ఎక్కడికక్కడ కార్మిక, కర్షకులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వ రంగ ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మెలో భాగస్వాములయ్యారు. రవాణా రంగంలో లారీలు, హైర్ బస్సులు రోడ్డెక్కలేదు.

అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన విశాఖ నగరంలోని సరస్వతీ పార్కు నుంచి డాబాగార్డెన్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఆశీలుమెట్ట జంక్షన్ వరకు భారీ ప్రదర్శన జరిగింది. 'మోడీ కార్పొరేట్


స్టీల్‌ప్లాంట్ పైలాన్ వద్ద నినాదాలు చేస్తున్న సిహెచ్.నర్సింగరావు తదితరులు

విధానాలు 2024 ఎన్నికల్లో ఓడితేనే దేశానికి రక్షణ' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అన్ని రంగాల కార్మికులూ పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నేతలు చేసిన ప్రసంగాలు ఆలోచింపజేశాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద జరిగిన


సమ్మెలో పాల్గొన్న రవాణారంగ కార్మికులు

కార్మిక, కర్షక సభలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మయ్య మాట్లాడారు. మోడీ వినాశకర విధానాలతో ప్రజల బతుకులు మిగతా 2లో..

## బిజెపి ఓటమితోనే దేశానికి రక్ష : సిహెచ్.నర్సింగరావు

వార్త 2లో..

## నిరాశ్రయులను రాత్రి బసలకు తరలించండి

వార్త 2లో..

## తెలుగు భాష పరిరక్షణకు దీక్ష

వార్త 2లో..

## ఎన్నికల ఏర్పాట్లు దాదాపు పూర్తి

### విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున



ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లాలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఎన్నికలకు సంబంధించి జిల్లాల్లో చేపట్టిన చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పిలతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సాయంత్రం సమీక్షించారు. దీనిలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలోని 1941 కేంద్రాల్లో ఫర్నిచర్, లైటింగ్, ర్యాంపులు, టాయిలెట్స్, తాగునీరు వంటి సదుపాయాలను సిద్ధం చేశామన్నారు. ఇప్పటి వరకూ 6, 7, 8 ఫారాలు 51,982 రాగా వాటిలో కొన్నింటిని పరిశీలించి ఆమోదించిన పిదప 38,295 ఫారాలు పెండింగ్ ఉన్నాయన్నారు. వీటిని వారంలోగా పరిష్కరిస్తామని తెలిపారు. పోలింగ్ అధికారుల్లో 120 శాతం సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాల్గొన్నారు.

## స్వదేశీ పరిజ్ఞానంతో ముందుకెళ్తాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వదేశీ పరిజ్ఞానంతో నావికాదళం మరింత ముందుకెళ్లనున్నట్టు తూర్పు నౌకాదళ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ తెలిపారు. భారతీయ పరిశ్రమల సహకారంతో తమ లక్ష్యాలను చేరుకుంటామన్నారు. సిఐఐ అధ్వర్యంలో శుక్రవారం విశాఖలో నిర్వహించిన సిఐఐ సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆత్మనిర్భర్ ప్రయాణంలో ఎక్కువ మంది పరిశ్రమ భాగస్వాములు చేరేలా చూసేందుకు ఇండియన్ నేవీ ఇండస్ట్రీ యాత్రలను ప్రారంభించిందని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా నౌకలు, జలాంతర్గామిల రూపకల్పన, నిర్మాణ సామగ్రి, యంత్రాలు, పరికరాల విభాగాల్లో స్వదేశీ విషయాలను మెరుగుపరచడంలో భారత నౌకాదళం ముందుందన్నారు. తాము 2035 నాటికి దాదాపు 170 నౌకలు, జలాంతర్గాములను నిర్మించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం, 67 నౌకలు నిర్మాణంలో ఉన్నాయని, మిగతా 2లో..

## త్వరలో బిజెపితో పొత్తు ప్రకటన

### టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బిజెపితో టిడిపి పొత్తు దాదాపుగా ఖరారైందని, వచ్చే రెండు మూడు రోజుల్లో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన అనంతరం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని టిడిపి మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పొత్తుల ప్రకటన అనంతరం సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎంవిపి.కాలనీలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 18న జరగాల్సిన నారా లోకేష్ ఉత్తర నియోజకవర్గం శంఖారావ సభ 19 ఉదయానికి మారినట్టు తెలిపారు. 18న విశాఖలో ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున, దీనిని మార్పు చేయాల్సి వచ్చిందని అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రికీ లేనటువంటి ఆంక్షలు జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నం వస్తుంటే పెడుతున్నారని తెలిపారు. అమరావతిలో రైతుల వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టే చిత్రం రాజధాని ఫైల్స్ అని తెలిపారు. కోర్టు తీర్పును తాము స్వాగతిస్తున్నామని అన్నారు. వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త మిగతా 2లో..

## మొదటి పేజీ తరువాయి..

### త్వరలో బిజెపితో పొత్తు ప్రకటన

వైవి.సుబ్బారెడ్డి రాష్ట్రంలో రాజధానిపై కొత్త వాదనలకు తెరలేపారని అన్నారు. వైసిపి మునిగిపోతున్న నావ అని గంటా అన్నారు. వాలంటీర్లను రెచ్చగొట్టే వ్యాఖ్యలను సిఎం జగన్మోహన్ రెడ్డి చేయడం దారుణమన్నారు. వాలంటీర్లను తమ పార్టీ కార్యకర్తలుగా పేర్కొనడం శోచనీయమన్నారు. వైసిపి సంక్షేమ పథకాలను ఎవరూ టచ్ చేయలేరని ఆయన వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.




సిఐఐ ప్రతినిధులతో రాజేష్ పెంధార్కర్

### స్వదేశీ పరిజ్ఞానంతో ముందుకెళ్తాం

వాటిలో 65 భారతీయ షిప్‌యార్డుల్లోనే ఉన్నాయని వెల్లడించారు. సమావేశంలో సిఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్, వోల్వో గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కమల్ బాలితో సహా ఆరు దక్షిణాది రాష్ట్రాల నుండి 60 మంది ప్రముఖ సిఇఒలు పాల్గొన్నారు.




దీక్ష చేపట్టిన ఫణిశయన సూరి

### తెలుగు భాష పరిరక్షణకు దీక్ష

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** తెలుగు భాష పరిరక్షణకు అందరూ కలిసిరావాలని తెలుగు దండు వ్యవస్థాపకులు పరవస్తు ఫణిశయన సూరి పిలుపునిచ్చారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆయన ఒక రోజు ఉపవాస దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకులు రాష్ట్రంపైనా, భాషపైనా అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 'తెలుగు దండు' ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనాలని సంకల్పించిందన్నారు. పార్లమెంటుకు పోటీ చేస్తామని అన్నారు.

### నేడు ప్రభుత్వ ఉద్యోగుల ర్యాలీ, సభ

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఉద్యోగుల ఎపి జెఎసి ఆదేశాల మేరకు శనివారం కలెక్టరేట్ వద్ద ర్యాలీ, సభ నిర్వహించనున్నట్టు జెఎసి జిల్లా ఛైర్మన్, ఎపి ఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం మూడో రోజుకు చేరిన సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఆర్.రవిశంకర్, వివివి.సత్యనారాయణ, నారాయణరావు పాల్గొన్నారు.

### వాలంటీర్లు సేవకులా.. వైసిపి కార్యకర్తలా ?

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** సచివాలయాల వాలంటీర్లు సేవకులా లేక వైసిపి కార్యకర్తలా అన్నది రాష్ట్ర ప్రభుత్వ స్పష్టం చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.నజీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. సమావేశంలో నాయకులు అబ్దుల్ చిన రెహమాన్, మహమ్మద్ గౌస్, చిన్ని పాల్గొన్నారు.

### 1054వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1054వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఆనందపురం బేవరేజ్ కార్పొరేషన్ కార్మికులు చొప్పా శ్రీను, ఎన్.కనకరాజు, వి.తిలక్, డి.సాయికిరణ్, సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు, అనపర్తి అప్పారావు కూర్చున్నారు.

# సమ్మె విజయవంతం

**(మొదటి పేజీ తరువాయి..)** ఎంత దుర్భరంగా మారాయో వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా ఉండే ట్రాన్స్‌పోర్టు రంగంపై వివిధ చట్టాలతో మోడీ సర్కారు దాడి చేస్తోందని తెలిపారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ వచ్చాక దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలైన ఓడరేవులు, విద్యుత్ సంస్థలు, రైల్వేలు, స్పోర్ట్స్ స్టేడియంలు అన్నీ ప్రైవేట్ వాళ్లకు ధారాదత్తం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఢిల్లీలో రైతన్నలు ఆందోళనలు చేస్తుంటే వారిపైకి తుపాకులు ఎక్కుపెట్టడం క్షంతవ్యం కాదన్నారు. పోర్టు అండ్ హార్బర్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవాధ్యక్షులు జెవి.సత్యనారాయణ మూర్తి, మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు మోడీ సర్కారు ఎలా కట్టబెడుతోందో వివరించారు. పంజాబ్, ఉత్తరప్రదేశ్, హర్యానా ప్రభుత్వాల నిర్బంధాన్ని ఎదుర్కొని ఢిల్లీకి రైతులు చేరుకుని, పోరాటం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియుల విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిఎస్.అచ్యుతరావు, ఎం.లక్ష్మిలు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేయడం, కార్పొరేటీకరణకు గురిచేయడం వంటి మోడీ విధానాలతో దేశంలో కార్మికవర్గం ఆగ్రహంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.మణి, జి.అప్పలరాజు, ఎం.అప్పలరాజు, ఒ.అప్పారావు, వి.నరేంద్ర కుమార్, పి.వెంకటరెడ్డి, ఎఐటియుసి నాయకులు ఎం.మన్మధరావు, ఎస్‌కె. రెహమాన్, జి.వామనమూర్తి, ఐఎన్‌టియుసి నాయకులు ఈశ్వరరావు, టిఎన్‌టియుసి నాయకులు పైడిరాజు, సిఎఫ్‌టియుఐ నాయకులు సురేష్, ఎపిఎఫ్‌టియు నాయకులు దేవా, ఎఐసిటియు నాయకులు శంకరరావు, ఎఐఎఫ్‌టియు నాయకులు గణేష్ పాండా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు లక్ష్మయ్య

#### ప్రభుత్వ రంగ సంస్థల్లో బంద్ విజయవంతం

విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో బంద్ విజయవంతమైంది. స్టీల్‌ప్లాంట్, బిహెచ్‌ఇఎల్, హెచ్‌పిసిఎల్, షిప్‌యార్డు, బిఎస్‌ఎన్‌ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో సంపూర్ణంగా సమ్మె జరిగింది. హిందుస్థాన్ షిప్‌యార్డులో జాతీయ ట్రేడ్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు మేరకు సిఐటియు, వైఎస్ఆర్‌టియుసి, సిపిటియుసి, టిఎన్‌టియుసి, టిఎన్ఇటియు, జెఎస్‌టియుసి, హెచ్‌ఎంఎస్ యూనియన్లు సమ్మెలో పాల్గొన్నాయి. సమ్మెను అణచివేయాలని షిప్‌యార్డు యాజమాన్యం కుట్రలు పన్నినా సరే శుక్రవారం ఉద్యోగులు, కార్మికులంతా కలసికట్టుగా సమ్మెలో పాల్గొన్నారు. షిప్‌యార్డును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు పూర్తిగా సమ్మెలో పాల్గొన్నారు. వారినుద్దేశించి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సిఐటియు గౌరవాధ్యక్షులు పి.శ్రీనివాసరాజు మాట్లాడారు. సంఘం అధ్యక్షులు జి.శ్రీనివాస్, నాయకులు వివి.రమణ, బట్ట గంగరాజు, నగిరెడ్డి .అప్పారావు పాల్గొన్నారు.

#### అనకాపల్లిలో..

మోడీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై జిల్లా నలుమూలలా నిరసన వ్యక్తమైంది. కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌కు అఖిల భారత కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రాలు, పారిశ్రామిక కూడళ్లలో కార్మికులు, రైతులు ర్యాలీలు, రాస్తారోకోలు, మానవహారాలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ప్రదర్శన, సభలో సిఐటియు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, కర్రి అప్పారావు పాల్గొన్నారు. అచ్యుతాపురం మండల కేంద్రంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కార్మిక, రైతుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. పరవాడ మండలం లంకెలపాలెం కూడలిలో జరిగిన రాస్తారోకో, మండల కేంద్రంలో జరిగిన ప్రదర్శనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లు తెచ్చిందని అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యపోరాటాలతో అడ్డుకోవాలన్నారు. కనీస వేతనాలు సాధించుకోవాలన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతుల పంటకు కనీస మద్దతు ధర చెల్లించాలన్నారు. లంకెలపాలెం కూడలిలో దఫదఫాలుగా రాస్తారోకో నిర్వహించారు. లంకెలపాలెం నుంచి ఫార్మాకు వెళ్లే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేపట్టారు.

### బిజెపి ఓటమితోనే దేశానికి రక్ష : సిహెచ్.నర్సింగరావు

**ఉక్కునగరం :** బిజెపి ఓటమితోనే దేశానికి రక్ష అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు పరిరక్షణ దీక్షలు శుక్రవారానికి 1100 రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ సమ్మె ప్రాధాన్యతను వివరించారు. అలాగే స్టీల్‌ప్లాంట్ పైలాన్ వద్ద సమ్మె సందర్భంగా జరిగిన కార్యక్రమంలోనూ పాల్గొని మాట్లాడారు. మోడీ ప్రభుత్వం పదేళ్లుగా కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేస్తోందని తెలిపారు. కార్మికులను అణగదొక్కే బిజెపి చర్యలను ఎంత మాత్రమూ సహించేది లేదన్నారు. ఢిల్లీలో రైతులు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే వారిపై దాడులకు దిగడం దారుణమన్నారు. 2019లో తిరిగి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం దాదాపు 30 సంస్థలను అమ్మకానికి పెట్టిందని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ జరుగుతున్నా సరే ఒక్క శాతం కూడా ప్రైవేటీకరణకు వెళ్లనివ్వని సంస్థ ఏదైనా ఉందంటే అది వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మాత్రమేనన్నారు. ఉక్కు పరిరక్షణకు జరుగుతున్న పోరాటాన్ని వివరించారు. రైతాంగ పోరాటానికి మద్దతు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మోడీ సర్కారును ఓడించాలని పిలుపునిచ్చారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో కన్వీనర్ జె.అయోధ్యరామ్, నాయకులు ఎన్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులను రాత్రి బసలకు తరలించండి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖ నగరంలో రోడ్లు, ఫుట్‌ఫాత్‌లు, ఫ్లై ఓవర్లు, రోడ్ల సెంటర్ మీడియన్లలో నిద్రిస్తున్న నిరాశ్రయులను జివిఎంసి నిర్వహిస్తున్న నైట్ షెల్టర్లకు తరలి ంచేలా చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయి కాంత్ వర్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) కెవి.పాపునాయుడును ఆదేశించారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి నైట్ షెల్టర్ల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రాత్రిపూట నిరాశ్రయులు రోడ్లపైన, బహిరంగ ప్రదేశాలలో నిద్రించకుండా వారిని నైట్ షెల్టర్లకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని, అందుకు మూడు బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాత్రిపూట నిరాశ్రయులు ఎక్కడబడితే అక్కడ నిద్రించడం వల్ల పలు ప్రమాదాలు, ఇతర సంఘటనలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో భూపేష్ నగర్ నైట్ షెల్టర్ నిర్వాహకులు కొల్లి సింహాచలం, టిఎస్ఆర్ నైట్ షెల్టర్ నిర్వాహకులు ప్రగడ వాసు, ఇతర నైట్ షెల్టర్ నిర్వాహకులతోపాటు జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

## పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

**-'ప్రజాశక్తి' కథనానికి స్పందన**



పైపులైన్‌కు చేపట్టిన మరమ్మతులు

**ప్రజాశక్తి- వేపగుంట:** వేపగుంట నుంచి చీమలాపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో పైపులైన్ లీకేజీతో తాగునీరు వృధాగా ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి, లీకేజీని నివారించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'అప్సా' రాష్ట్ర కార్యదర్శిగా సత్యన్నారాయణ



నియామకపత్రం అందుకుంటున్న సత్యనారాయణ

**ప్రజాశక్తి -గాజువాక :** ఎపి ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) రాష్ట్ర కార్యదర్శిగా దిబ్బపాలెం బాపూజీ విద్యాలయం కరెస్పాండెంట్ మడిశర్ల సత్యన్నారాయణను ఎన్నుకున్నారు. రాష్ట్ర మహాసభలో ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా సత్యనారాయణను పలువురు అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు సుందరాం, చంద్రశేఖర్, రాము, రవీంద్ర, గౌరవాధ్యక్షుడు ఎం.జనార్దన్, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు, సెక్రెటరీ సింహాచలం పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఉద్యోగుల ఆందోళన



ధర్నా చేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి- భీమునిపట్నం** : న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ భీమిలి తాలూకా యూనిట్ ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం లోవరాజు, కె.సాయిబాబా, కన్వీనర్ కె.ముత్యాలరావు, పెన్షనర్ల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు టి భీమారావు, ఎం ఆనందరావు పాల్గొన్నారు

## బదిలీ జెడ్‌సికి ఘనవీడ్కోలు



జెడ్‌సి మల్లయ్యనాయుడును అభినందిస్తున్న ఉద్యోగులు

**ప్రజాశక్తి- వేపగుంట :** జివిఎంసి ఎనిమిదో జోన్ కమిషనర్‌గా పనిచేసి, బదిలీపై వెళుతున్న మల్లయ్యనాయుడుకు శుక్రవారం ఘనవీడ్కోలు పలికారు. వేపగుంట దరి శ్రీకృష్ణదేవరాయ కాపు సామాజిక భవనంలో మల్లయ్యనాయుడును పుష్పగుచ్ఛాలతో అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో జోనల్ కార్యాలయ సూపరెంటిండెంట్ శ్రీనివాసమూర్తి, వైద్యాధికారి కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ రమణ, ఎపిడి శ్రీరాం తదితరులు మాట్లాడుతూ, జెడ్‌సి సేవలను కొనియాడారు. టిపిఎస్ తేజ, సిబ్బంది పాల్గొన్నారు. ప్రస్తుత జెడ్‌సి హేమావతి రాకపోవడంపై పలువురు నిరాశ చెందారు.

# నిర్వాసిత కాలనీల అభివృద్ధికి అధిక నిధులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి.

**ప్రజాశక్తి -గాజువాక** : నిర్వాసిత కాలనీల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించినట్లు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం జివిఎంసి 87వ వార్డు వడ్లపూడిలో రూ.2.34కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కణితి కళింగ వీధిలో రూ. 19.92 లక్షలతో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గ్రంథాలయ భవన నిర్మాణం, పార్కులో రూ.18.9లక్షలతో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, వడ్లపూడి పప్పికొండ కాపు ప్రాంతంలో రూ.1.95కట్లతో ప్రధాన కాలువ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. వడ్లపూడి మెయిన్‌రోడ్డు నుంచి గాంధీ బొమ్మ వరకు ప్రధాన రహదారి పునర్నిర్మాణ పనులను త్వరలో చేపడతామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులను కల్పించి, గాజువాకను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కోమటి శ్రీనివాస్, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద, ముద్దపు దామోదర్, సచివాలయం కన్వీనర్ దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, ఎన్నేటి రమణ, సిహెచ్‌వి రమణ, బోండా గోవిందరాజులు, ప్రగడ శ్రీనివాస్, ఎస్ పాపారావు, ప్రగడ శంకరరావు, ఆడారి శ్రీను, వడ్లపూడి, కళింగ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# నెలాఖరులోగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి

**ప్రజాశక్తి-పెందుర్తి** : టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎపి టిడ్‌కో చైర్మన్ ప్రసన్నకుమార్ ఆదేశించారు. శుక్రవారం .92వ వార్డు శివారులో ఇళ్ల నిర్మాణ పనులను, రోడ్డు పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు ఈసందర్భంగా రోడ్ల నాణ్యత, మంచినీటి ట్యాంకును పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రసన్నకుమార్

# పలువురికి వైసిపి పదవులపై హర్షం

**ప్రజాశక్తి -పిఎం.పాలెం:** వైసిపి యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా ఆరో వార్డు బక్కన్నపాలేనికి చెందిన రాయన సాయికుమార్‌ను నియమించారు.. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తా మన్నారు.

**ఆరిలోవ :** వైసిపి ఎస్‌సి విభాగం జిల్లాజనరల్ సెక్రటరీగా ఆరిలోవకు చెందిన పిల్లి వీర్రాజును పార్టీ అధిష్టానం నియమించింది. తనపై పార్టీ ఉంచిన బాధ్యతను నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు

**సీతమ్మధార :** వైసిపి యువజన విభాగం విశాఖజిల్లా జనరల్ సెక్రటరీగా ఉత్తర నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మువ్వల సంతోష్ కుమార్‌ను పార్టీ అధిష్టానం నియమించింది.

**సీతమ్మధార** : వైసిపి విశాఖ జిల్లా ఐటి విభాగం ఉపాధ్యక్షులుగా కొట్యాడ సూర్యనారాయణను నియమించారు. వైఎస్ఆర్ ఆశయాలకు అనుగుణంగా జగన్ వెంట నడిచిన సూర్యనారాయణను, 2016లో ఉత్తర నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షులుగా పనిచేశారు. ప్రార్టీ నియమించింది ఆయన సేవలను గుర్తించి, ఇపుడు ఐటి విభాగం విశాఖ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించడంపై హర్షం వ్యక్తమౌతోంది.

ఈసందర్భంగా వారంతా సిఎం జగన్, వైసిపి రీజనల్ కోఆర్డినేటర్లు వైవి.సుబ్బారెడ్డి, వి.విజయసాయి దచీశీఅవగరెడ్డి, జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కెకె.రాజు, బోండా ఉమామహేష్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

# పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

**ప్రజాశక్తి -గాజువాక** : సిఎల్‌సి చర్చి ఆధ్వర్యంలో పేదలకు శుక్రవారం కుట్టుమిషన్లును బిషప్ సుధీర్‌కుమార్ మహంతి, బిసి కులాల నేత పప్పు రాజారావు పంపిణీ చేశారు. ఈ సంధ్భంగా బిషప్ మహంతి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన బడుగు బలహీన వర్గాల మహిళలకు స్వయంఉపాధికి కుట్టుమిషన్లు అందజేశామన్నారు. సిఎల్‌సిచర్చి ఆధ్వర్యంలో విద్య, వైద్యం, తాగునీరు, అన్నదానం ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర బిసి కులాల నేత పప్పు రాజారావు మాట్లాడుతూ శీనగర్‌లోని సిఎల్‌సి చర్చి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమములో సిఎల్‌సి వైస్‌చైర్మన్ ఆల్ఫ్రెడ్ మహంతిపాల్గొన్నారు..



కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న పప్పు రాజారావు, మహంతి.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : 33/11కెవి విద్యుత్ లైను ఆనందపురం, వేములవలస, వెల్లంకి, భీమిలి పీడర్లలో నిర్వహణ పనుల దృష్ట్యా ఈనెల 17న ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడవజోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. జెవి అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**మధురవాడ :** మారికవలస సబ్‌స్టేషన్ 11కెవి ఫీడర్ మరమ్మతుల కారణంగా మారికవలస జంక్షన్, జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీ, శారదానగర్ కాలనీ, పిపి2 కాలనీ, గాయత్రి హాస్పిటల్, వైఎస్సార్ కాలనీ,కొమ్మాది పెట్రోల్ బంక్,వికలాంగుల కాలనీ, కార్పెంటర్స్ కాలనీ, స్వయంకృషి నగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మూడవ జోన్ ఎపిఇపిడిసిఎల్ డిఇఇ పి.శ్రీనివాసరావు తెలిపారు.

## అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కెకె.రాజు

**ప్రజాశక్తి -మాధవధార** : ఉత్తర నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. శుక్రవారం 51వ వార్డులో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో రూ.2.34కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.అంబేద్కర్ కాలనీలో రూ.39లక్షలతో నిర్మించిన కళావేదిక, విద్యానగర్‌లో రూ.19.95 లక్షలతో, రాజీవ్‌నగర్‌లో రూ.18లక్షలతో. గాంధీనగర్ ఈస్ట్‌పార్క్ ప్రాంతంలో రూ.39.74లక్షలతో, వుడాకాలనీలో రూ.98.41లక్షలతో నిర్మించిన బిటి రోడ్లను, కళింగనగర్‌లో రూ.19.20లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, కాలువలను ప్రారంభించారు.కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, 50వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, రాష్ట్ర మహిళ విభాగం వైస్‌ప్రెసిడెంట్ పేడాడ రమణికుమారి, డిఇఇ భరణి, ఎఇఇ రత్నాకర్, అంబటి శైలేష్, కృష్ణారావు, పైడి శ్రీను, దిడ్డి రమేష్, విశ్వనాథరాజు, రాజాం రాజు, అమర్ రెడ్డి, తిరుమలరావు, వై.వరలక్ష్మి, దమయంతి, శ్యామ్, రత్నం, పప్పల లక్ష్మణ్, రామ్మోహన్, పొన్నాడ అప్పారావు, నూకరాజు, కన్నబాబు, యం.శ్రీను, త్రినాధ్, అప్పలనాయుడు, కె.అప్పారావు, ఆర్.అప్పారావు పాల్గొన్నారు.

## అక్రమ తవ్వకాలపై చర్యలేవీ?



అక్రమ తవ్వకాల ప్రాంతంలో పర్యటిస్తున్న బండారు

**ప్రజాశక్తి-పెందుర్తి** :అసైన్‌మెంట్ భూముల్లో అక్రమంగా త్రవ్వకాలు జరిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఆర్ పురం గ్రామంలో క్వారీ చుట్టుపక్కల ప్రాంతాలలో పర్యటించారు ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ వైసిపి నాయకుడు ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, ఇపుడు చర్యలు చేపట్టకుంటే, అపుడు అందరిపైనా చర్యలు తప్పవన్నారు.

## అక్రమ కట్టడాలపై చర్యలకు వినతి

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసిమూడో వార్డు పరిధిలో సముద్ర తీరాన సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న శాశ్వత కట్టడాలకు అడ్డుకట్ట వేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం జెడ్‌సి కె కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సహజ సిద్ధంగా ఉన్న గెడ్డలను కూడా మూసేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నేతల ప్రోద్బలం, ప్రమేయంతో చేపడుతున్న అక్రమ కట్టడాలను కూల్చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేటి శంఖారావ సభకు తరలిరండి

**ప్రజాశక్తి- వేపగుంట :** ఈనెల 17న శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు 94వ వార్డు వేపగుంట కృష్ణరాయపురం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావ సభకు పెందుర్తి నియోజకవర్గంలోని జనసేన కుటుంబ సభ్యులందరూ పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. జనసేన పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల రమేష్‌బాబు ఆదేశాలతో పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

ప్రజాశక్తి
విశాఖపట్నం
అనకాపల్లి
శనివారం
17 ఫిబ్రవరి 2024



అనకాపల్లి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మికులు, ప్రజాసంఘాలు



గాజువాకలో ర్యాలీలో సిఐటియు, సిపిఎం నేతలు, పెన్షనర్ల సంఘం నాయకులు



ఆనందపురంలో లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ధర్నా




తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్ద నిరసనలో మాట్లాడుతున్న సిపిఐ నేత జెవి.సత్యనారాయణమూర్తి



లంకెలపాలెం వద్ద రాస్తారోకోలో నినదిస్తున్న సిఐటియు నేత కోటేశ్వరరావు

# ఉవ్వెత్తున ఎగసిన నిరసనలు

## పారిశ్రామిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ సక్సెస్




పద్మనాభంలో రైతులు, కూలీలతో ధర్నాలో సిపిఎం నేత గంగారావు



దేవరాపల్లిలో రాస్తారోకో




బుచ్చయ్యపేట మండలం రాజాంలో సిఎఫ్‌టియుఐ ఆధ్వర్యాన నిరసన



భీమిలిలో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన ర్యాలీ

**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం తలపెట్టిన పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్‌బంద్ విజయవంతమైంది. వామపక్షాలతోపాటు కొన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, అఖిలపక్ష కార్మిక సంఘాలు, యూనియన్లు పాల్గొని ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలతో హోరెత్తించి, సమ్మెను సూపర్ సక్సెస్ చేశారు.**

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

**గాజువాక** : సిఐటియు, పెన్షనర్ సంఘం ఆధ్వర్యంలో పాత గాజువాక నుండి కొత్త గాజువాక వరకు ర్యాలీ, కొత్త గాజువాకలో బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్, రైల్వే, ఎల్‌ఐసి వంటి ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కటెట్టబెట్టి, రైతులను, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలను ప్రధానిమోడీ దోచుకుంటున్నారన్నారు. సిఐటియు జిల్లా కమిటీ నాయకులు ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు కనీసవేతనాల అమలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సిఐటియు గాజువాక ప్రధాన కార్యదర్శి ఎ.లోకేష్, ఎం రాంబాబు నమ్మి రమణ, డి రమణ, ఎం రాజేంద్రప్రసాద్, బి గురప్ప, కెపి కుమార్ నానాజీ, రైల్వే వేగన్ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి రాజు ఐద్వా నేతలు కే సంతోషం జి లక్ష్మి భావన, బి శ్రీనివాస్, జి.అప్పారావు, జి రాము, గణేష్, నాగరాజు పాల్గొన్నారు.

**గాజువాక** : దేశవ్యాప్తసమ్మెలో భాగంగా భెల్ మెయిన్‌గేటు వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఉద్యోగులను, అడ్డుకున్నారు. గుర్తింపు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి బాబూరావు, ఎస్ సాహు, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి వి బాబూరావు, సిఐటియు ప్రధాన కార్యదర్శి, జిటిపి.ప్రకాష్, పివిఎన్ రాజు, ఎస్ జగన్నాధరావు, కొల్లి దేవుడు, విఆనందరావు, పి.కనకారావు,బి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

**తగరపువలస** : సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన తగరపువలస వెల్ఫేర్ సెంటర్ నుంచి కార్మికవాడ మీదుగా జంక్షన్ వరకు ర్యాలీ, మానవహారం నిర్మించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, ఎఐటియుసి కానూరి రాంబాబు, సిఐటియు నేత ఎస్ అప్పలనాయుడు, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాగం లక్ష్మి, ఆశా, అంగన్వాడీ, విఒఎలు, ఆటో, ముఠా,తోపుడుబళ్ల కార్మికులు దుర్గా, లక్ష్మి, పార్వతి, దుర్గారావు, నరసింగరావు, ఇంటి రాంబాబు పాల్గొన్నారు

**ఆనందపురం:** దుక్కవానిపాలెం చెక్‌పోస్ట్ వద్ద లారీ ఓనర్స్, డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డ్రైవర్లకు ఆశనిపాతం వంటి జిఒ 106(2) రద్దు చేసేవరకు పోరాటాలు ఆగవని నేతలు స్పష్టం చేశారు.పలు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బంక శ్రీను, కోరాడ శ్రీను, శ్రీరాములు గురునాయుడు, ఎంవి రమణ, కె.రమణ, మాధవరావు, రాంబాబు, జగ్గారావు, జి సూర్యనారాయణ, పూడి అప్పారావు, బి పైడినాయుడు పాల్గొన్నారు

**పద్మనాభం:** పద్మనాభం జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో వ్యవసాయ కూలీలు, రైతులు ర్యాలీ, మానవహారం నిర్మించారు. గిట్టుబాటు ధరలేక, రాయితీలను రద్దుచేసి, వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపిని, దానికి వత్తాసు పలుకుతున్న రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలకు బుద్ధి చెప్పాలని సిపిఎ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు భీమిలి సిఐటియు నేత రవ్వ నర్సింగరావు పిలుపునిచ్చారు.

**పెందుర్తి** : సిఐటియు పెందుర్తి జోన్ కార్యదర్శి శంకరరావు ఆధ్వర్యంలో రైతుబజార్ నుండి జంక్షన్ వరకు ర్యాలీ, మానవహారం, సభ నిర్వహించారు. సిఐటియు నాయకులు అప్పలనాయుడు, సూర్యప్రకాశరావు, లక్ష్మి, విజయ, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, పిఒడబ్లు నిర్మల పాల్గొన్నారు.

**మధురవాడ:** మోటారు కార్మికులసమ్మెలో భాగంగా కొమ్మాది కూడలిలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆటో, రిక్షా కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలియజేయడంతో సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, కూటికుప్పల రాము, పి సత్తిబాబు, ఎస్ ప్రసాద్, ఎం రమణ, కుమార్ షణ్ముఖ, హనుమంతు కృష్ణ, ఎం రాము, ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని పిఎం.పాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చూపించి, తర్వాత పూచీకత్తుపై విడుదల చేశారు. జి.చిన్న, బి నాగేశ్వరరావు, ఎం.రాము, వై యాద్రయ్య,, ప్రసాద్ పాల్గొన్నారు.

**ములగాడ** : పారిశ్రామిక ప్రాంతం హెచ్‌పిసిఎల్, షిప్‌యార్డ్ గేట్ల వద్దకు సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, టిఎన్‌టియుసి అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు ఉదయం 5 గంటలకే చేరుకొని కార్మికులు లోపలకు వెళ్ళకుండా అడ్డుకొన్నారు. మోడీ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లేబర్ గేటు వద్ద బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు జిల్లాకార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐయన్‌టియుసి జిల్లా కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, టిఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి నక్కా లక్ష్మణరావు, ఎఐటియుసి జిల్లానాయుకులు కె.సత్యనారాయణ పాల్గొన్నారు. మల్కాపురం నుండి కోరమండల్ గేట్ వరకు హెచ్‌పిసిఎల్, కోరమండల్ గోదాం కార్మికులు వందలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు.వివిధ కార్మిక సంఘాల నాయకులు కె.పెంటారావు పి.పైడిరాజు, భాస్కరరావు, పి.సురేష్, జి.నరేష్, కె.రాము, తాతబాబు నర్సింగ్, సత్యాంజనేయ, రాంబాబు, కృష్ణ, రమణ, ఎస్ ప్రసాద్, జానకిరాం, బిఎస్‌ఎన్.రాజు పాల్గొన్నారు.

**నక్కపల్లి:**మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన ప్రదర్శన చేపట్టారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిఐటియు నాయకులు, కార్మికులు నూకాలమ్మ గుడి వద్ద నుండి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.దుర్గారాణి, ఐకెపి రంగం సత్యనారాయణ, ఆటో, ఆశ యూనియన్, ప్రజానాట్య మండలి నేతలు పాల్గొన్నారు.

**చీడికాడ:**మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన ప్రదర్శన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి ఆర్ దేముడునాయుడు, సంఘాల నేతలు ఎం.జానకి, బి.ఉమాకామాక్షి, వరలక్ష్మి పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్:** సిబిఎం కాంపౌండ్ నుండి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు ర్యాలీ చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిఐటియ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడారు.ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, ఎపి రైతు జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎఐటియుసి రాష్ట్ర సమీతి సభ్యులు రమణ, కెసిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

**మాడుగుల:** మాడుగులలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఇరట నరసింహమూర్తి, ఆర్ దేముడు నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కార్లి భవాని, కాంగ్రెస్ నాయకులు పడాల కొండలరావు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం



ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

**అచ్యుతాపురం:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తుందని, రానున్న ఎన్నికలలో మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామీణ బందలో భాగంగా అచ్యుతాపురం, హరిపాలెం కేంద్రాల్లో సిఐటియు, రైతు సంఘాల ఆధ్వర్యాన బంద్ జరిగింది. అనకాపల్లి -అచ్యుతాపురం రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అచ్యుతాపురంలో రాస్తారోకో చేపట్టారు. ఇందులో పాల్గొన్న లోకనాథం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసి ప్రజల నెత్తిన భారాలు వేసిందని తెలిపారు. మరో వైపు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. దేశ సంపదను అంబానీ, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా దోచిపెడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రైతు సంఘం, సిఐటియు, ఎపి రైతు సంఘం నాయకులు ధర్మరెడ్డి చిన్నబాబు, ఎన్.కామేశ్వరరావు, ఆర్. రాము, కె.సోము నాయుడు, కె.రామ సదాశివరావు, ఎస్ కన్నమ్ నాయుడు, బుద్ధ రంగారావు పాల్గొన్నారు.

**అనకాపల్లి** : కేంద్ర బిజెపి కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె - గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా శుక్రవారం అనకాపల్లి జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, కాంగ్రెస్, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిఐటియు కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ మీదగా ఆర్డీవో ఆఫీస్ వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. శంకర్రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు ఆర్.దొరబాబు, పిఎన్‌వి.పరమేశ్వరరావు, నందారపు భాస్కరరావు, బోయిన భానుమూర్తి యాదవ్, వివి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, పలక సత్యనారాయణ, ఎంపీ నాయుడు, బి నాగప్పరావు, సిహెచ్.శివాజీ, సూర్యకళ, ఎ.రాజు, నూక అప్పారావు, పాల్గొన్నారు.

**పరవాడ** : పరవాడ సినిమా హాల్ జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వర రావు మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు ఉరితాడు లాంటి బిఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలని ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఎన్.గురునాధరావు, జి.శ్రీను, ఆర్.కన్నబాబు, పైలా అప్పలనాయుడు పాల్గొన్నారు. పరవాడ మండలం లంకెలపాలెంలో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో కె.వెంకట్రావు, అప్పలరాజు, రామారావు, డి దేముడు పాల్గొన్నారు.

**సబ్బవరం** : ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎన్.శాంతి కుమారి, ఎన్.సూరి కుమారి, ఏ.దుర్గాదేవి, వి.కళ్యాణి, ఆర్ వరలక్ష్మి, డి.రమణమ్మ, కనకమ్మ, సిహెచ్.లక్ష్మి పాల్గొన్నారు.

**దేవరాపల్లి** : ప్రజా సంఘాల ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, వామపక్ష పార్టీలు, పలు సంఘాల నాయకులు బిటి దొర, యామల కన్నబాబు, కె సూరిబాబు, వరలక్ష్మి పాల్గొన్నారు.

**చోడవరం** : చోడవరంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుండి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, సిఐటియు నాయకులు ఎస్వీ నాయుడు, రెడ్డిపల్లి అప్పలరాజు, జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

**మునగపాక** : సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన అంగన్వాడీ, ఆశా, వివోఎ, వీఆర్‌ఏలు స్థానిక మెయిన్ రోడ్ మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అక్కడ ధర్నా చేసి, వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎస్ బ్రహ్మాజీ, ఆళ్ళ మహేశ్వరావు, జయలక్ష్మి, సన్యాసినాయుడు, ఆశాలు పార్వతి పాల్గొన్నారు.

**కె.కోటపాడు** : మండలం కేంద్రంలో సిపిఎం, సిపిఐ, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీలు, సంఘాల నాయకులు గండి నాయన బాబు, వేచలపు వెంకటరమణ, గాడి ప్రసాద్, వనుం సూర్యనారాయణ, రొంగలి ముత్యాల నాయుడు, ఎర్ర దేముడు పాల్గొన్నారు.

**రాంబిల్లి** : రాంబిల్లి మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆటో, మోటార్, భవన నిర్మాణ, ఎన్ఎఓబి, ముఠా కార్మికులు, స్కీమ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు, రైతులు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. జి దేముడు నాయుడు, సిహెచ్.రామకృష్ణ, రమ్య, నారాయణరావు లక్ష్మీనారాయణ, మహేష్ పాల్గొన్నారు.

**కశింకోట** : కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన కసింకోట మార్కెట్ నుండి జాతీయ రహదారి మీదుగా తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అక్కడ ధర్నా చేపట్టారు. తాసిల్దార్‌కు సమస్యల వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాకారపు శ్రీనివాసరావు, బి.సోమునాయుడు, కె తనూజ, ఎం శ్రీదేవి, పి నాగేశ్వరరావు, డిడి వరలక్ష్మి పాల్గొన్నారు.

**బుచ్చయ్యపేట** : మండలంలోని రాజాంలో సిఎఫ్‌టియుఐ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎన్ కనకారావు, ఎన్.సత్యనారాయణ, మరిసా సతీష్, మరిసా నరేష్, మరిశా నాగ అప్పారావు పాల్గొన్నారు.

### నిలిచిన హైర్ బస్సులు

**ఎంవిపి.కాలనీ** : సమ్మెలో భాగంగా వాల్తేరు, మద్దిలపాలెం, విశాఖ వన్ డిపో, సింహాచలం, గాజువాక, కూర్మన్నపాలెం డిపోల్లో హైర్‌బస్‌లు నిలిచిపోయాయి. ఎపిఎస్ ఆర్‌టిసి హైర్‌బస్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు కెజె.అప్పారావు డిమాండ్ చేశారు. డిపోల వద్ద నిరసన తెలియజేసి నగరంలో జరిగిన ప్రదర్శనలో కార్మికులు పాల్గొన్నారు. నాయకులు సింహాచలం, సురేష్, శేషు తదితరులు మాట్లాడారు.




మధురవాడలో ఆటో కార్మికుల భారీ ర్యాలీ



చోడవరంలో బంద్ సందర్భంగా నిరసన ప్రదర్శన



మాడుగులలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన



హెచ్‌పిసిఎల్ గేటు వద్ద అఖిలపక్ష కార్మికుల ఆందోళనలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



నక్కపల్లిలో సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యాన ఆందోళన



నర్సీపట్నంలో సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల ఆందోళన



పెందుర్తిలో సిపిఎం, ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన ర్యాలీ



ఆందోళన చేస్తున్న ఆర్‌టిసి అద్దె బస్సు కార్మికులు



సమ్మెలో భాగంగా ప్రదర్శించిన దేశ ఐక్యతను చాటిచెప్పే కళాకృతి

## వైసిపిని ఇంటికి పంపించాలి


విజయ చిహ్నం చూపుతున్న టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-దేవరపల్లి :** రానున్న ఎన్నికల్లో వైసిపిని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్ఛార్జి పివిజి కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. బాబు షూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రామానాయుడు చేపట్టిన పాదయాత్ర మూడో రోజుకు చేరుకుంది. శుక్రవారం ఎన్.గజపతినగరం, వడ్రపాలెం, ఎం.అలమండ, పెదనందిపల్లి గ్రామాలలో నిర్వహించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని, అందరినీ పలకరిస్తూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. పెదనందిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన టిడిపి శ్రేణుల సమావేశంలో వారు మాట్లాడుతూ టిడిపి జనసేన నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా పని చేసి మాడుగుల కోటలో విజయ దుందుభి మోగించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సిహెచ్ సూర్యనారాయణ, శరకాల సూర్యనారాయణ పోతల పాతూరు నాయుడు, జనసేన నాయకులు రాయపరెడ్డి కృష్ణ, గొర్రెపోతు రామ్మూర్తి నాయుడు, బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## 25న రాష్ట్రస్థాయి బౌద్ధ సమ్మేళనం

**ప్రజాశక్తి -అనకాపల్లి :** ఈ నెల 25న రాష్ట్ర స్థాయి 11వ బౌద్ధ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు, విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆర్గనైజింగ్ ప్రచార కార్యదర్శి బల్లా నాగభూషణం తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన కరపత్రాలను స్థానిక పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. మహా సమ్మేళనంలో బర్మా దేశ మయన్మార్ బౌద్ధ భిక్షువులు ఆయుపాల మహాథేరో భంతేజీ, సారి పుత్ర భంతేజీ భగవాన్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నేలపూడి బాలరాజు, గిలకల అప్పారావు, రొబ్బి మల్లేశ్వర రావు, పెదిరెడ్ల సుజాత, పల్లా బాబ్జీ పాల్గొన్నారు.

## వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన

**ప్రజాశక్తి-అనకాపల్లి :** స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ విశాఖపట్నం బస్ స్టాప్ వద్ద శుక్రవారం వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి - ఎయిడ్స్‌పై జానపద కళా రూపాల- వీధి నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని డిఎల్ఓ బాలాజీ జెండా ఊపి కార్య క్రమాన్ని ప్రారంభించారు. పిపిటి సిటి కౌన్సెలర్ ప్రసాద్, యస్‌విడియస్‌జి ఎల్ నాయుడు, లింక్ వర్కర్స్ జిల్లా రిసోర్స్ పర్సన్ గోవిందరావు, కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

## టిడిపి విస్తృత స్థాయి సమావేశం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** తెలుగుదేశం పార్టీ అనకాపల్లి మండల విస్తృత స్థాయి సమావేశం తుమ్మపాల బంగార్రాజు కళ్యాణమండపంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 19న అనకాపల్లి పట్టణంలో జరిగే నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబి, అప్పలరాజు, అక్కిరెడ్డి వెంకటరమణ, జెర్రిపోతుల ధర్మారావు, చెక్కల శ్రీను, సడిపల్లి బోసు బాబు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు పలు వినతులు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** జిల్లా పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు అదనపు ఎస్పీ పి.సత్యనారాయణరావు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించేందుకు ఈ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు సిబ్బంది వారి అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను విన్నవించుకోగా, అదనపు ఎస్పీ వాటిని పరిశీలించి, సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## గౌరీశ్వరస్వామి ఆలయంలో కల్యాణ రాట


**ప్రజాశక్తి-చోడవరం :** మహాశివరాత్రిని పురస్కరించుకొని స్థానిక గౌరీశ్వరస్వామి ఆలయంలో కళ్యాణరాటను శుక్రవారం వేశారు. నెలరోజులపాటు జరిగే కార్యక్రమాలకు శుక్రవారం రథసప్తమి సందర్భంగా అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన పురోహితులు కొడమంచిలి చలపతిరావు, దేవాదాయ శాఖ సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, నాగులపల్లి రాంబాబు పాల్గొన్నారు.

## నేడు బహుళ సామాజిక భవనం ప్రారంభం

**ప్రజాశక్తి - కశింకోట :** మండలంలోని ఉగ్గినిపాలెం గ్రామంలో అరబిండ్ ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన బహుళ సామాజిక భావాన్ని శనివారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రారంభించనున్నట్లు ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగ గున్నయ్య నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త భరత్ కుమార్ ఎంపీపీ కలగ లక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ జాన్స్ విద్యార్థి

**ప్రజాశక్తి-కశింకోట :** అనకాపల్లి జివిఎంసి వుడ్‌పేట స్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ వైజ్ఞానిక ప్రదర్శనలో కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న టి శిరీషా ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో శిరీషాను శుక్రవారం ప్రిన్సిపల్ రూపానంద, అకాడమిక్ ఇన్‌ఛార్జ్ చంద్రమౌళి, విద్యార్థులు అభినందించారు.


శిరీషాను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

## సూర్యనారాయణ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

**ప్రజాశక్తి-అనకాపల్లి**

అనకాపల్లి మండలం రాజుపాలెం గ్రామంలోని శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి శుక్రవారం రథసప్తమి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు దొడ్డిపట్ల కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీసూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బండారి ఆదిబాబు ఉమా దంపతుల ఆర్థిక సహకారంతో భారీ అన్న సమారాధనాలు నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కుటుంబ సమేతంగా, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు దంపతులు, ఏపీఈడబ్ల్యుఐడి చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, నియోజవర్గం వైసీపీ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ పరుచూరి భాస్కరరావు, పలువురు నాయకులు దర్శించుకున్నారు.

స్థానిక జార్జ్ క్లబ్‌లో పతాంజలి యోగ సమితి, భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు యోగ గురువులు భీశెట్టి దోరమనాయుడు ఆధ్వర్యంలో రథసప్తమి పురస్కరించుకొని యోగ సూర్య నమస్కారాలు వేశారు. కార్యక్రమంలో కొణతాల మహాలక్ష్మి నాయుడు, కాళ్ళ వివి సత్యనారాయణ, ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సూర్యనారాయణమూర్తి ఆలయం వద్ద మంత్రి, నాయకులు

**కె.కోటపాడు :** మండలంలోని ఆర్‌వై.అగ్రహారంలో రథసప్తమి సందర్భంగా శ్రీసూర్యనారాయణమూర్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీ సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పురాతనమైన ఈ ఆలయానికి అనేక గ్రామాల నుండి భక్తులు తరలివచ్చారు. గ్రామస్తులు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

## చిత్రకళలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**ప్రజాశక్తి- అనకాపల్లి**

పెన్సిల్ కళపై ఆసక్తితో ఏ గురువు లేకుండానే సృజనాత్మక చిత్రాలను రూపొందిస్తూ, ఆర్కిటెక్చర్ చదువుతున్న ఆర్ట్ సంఘ్వి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి నటరాజన్ గుల్జార్ అన్నారు. పెన్సిల్, సృజనాత్మక చిత్రకళలో రాష్ట్ర, జాతీయ గుర్తింపు పొందిన అనకాపల్లికి చెందిన ఆర్ట్ సంఘ్విని నటరాజన్ గుల్జార్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనదేశ యువత ప్రతిభ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తున్నారు. యువతరాన్ని తల్లిదండ్రులతో పాటు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ప్రోత్సహించి వారి ప్రతిభకు మరింత పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. బుల్లయ్య కళాశాల సమీపంలో రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు.


పెన్సిల్‌తో వేసిన చిత్రాన్ని అందిస్తున్న సంఘ్వి

## వైసిపి యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవీంద్ర రాజు



**ప్రజాశక్తి -అచ్యుతాపురం :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లవరం గ్రామానికి చెందిన పిన్నమరాజు రవీంద్ర రాజును పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు, బొడ్డేడ ప్రసాద్ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## వికలాంగునికి వీల్‌చైర్ అందజేత

**ప్రజాశక్తి -కశింకోట :** మండలంలోని జమ్మాదులపాలెం గ్రామంలో వికలాంగుడు ఉమ్మి అప్పారావుకి వైసిపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ శుక్రవారం వీల్‌చైర్ అందజేశారు. అనంతరం తడి చెత్త -పొడి చెత్త కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు బకెట్లు పంపిణీ చేశారు. దీనికి ముందు గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి తీర్థం మహోత్సవం స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు, మలసాల కిశోర్, మలసాల కుమార్ రాజా, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు, కరక సోమునాయుడు, అద్దిపల్లి శ్రీను పాల్గొన్నారు.

## ఎస్‌పిని కలిసిన ఎస్‌బి డిఎస్‌పి అప్పారావు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి.అప్పారావు శుక్రవారం జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బి.అప్పారావు రాజమండ్రి, ఎస్‌బి డిఎస్పీగా పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా అనకాపల్లి జిల్లా, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా వచ్చారు.

## 'రాజధాని ఫైల్స్'తో జగన్ వెన్నులో వణుకు

**ప్రజాశక్తి-అనకాపల్లి, చోడవరం, అచ్యుతాపురం**

రాజధాని ఫైల్స్ సినిమాతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెన్నులో వణుకు పుట్టిందని టిడిపి నాయకులు అన్నారు. శుక్రవారం అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, చోడవరంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, అచ్యుతాపురంలో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు విలేకర్ల సమావేశాల్లో మాట్లాడారు. రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వ కుట్రలు కోర్టు తీర్పుతో బట్టబయలయ్యాయన్నారు. రాజధాని విషయంలో జగన్ చేసిన విష ప్రచారం, అమరావతి విధ్వంసంపై సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారని తెలిపారు. వేల కోట్ల ప్రభుత్వ సంపదను ఎలా నాశనం చేశారు, రైతులు మహిళలు పట్ల ఎంత దారుణంగా వ్యవహరించాడనే నిజాలు ప్రజల్లోకి వెళ్లాయని ఆయన చెప్పారు. ఈ విలేకర్ల సమావేశాల్లో ఆయా నియోజకవర్గాలకు చెందిన పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా తీర్థ మహోత్సవాలు

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండలంలోని రావులమ్మపాలెం గ్రామంలో రథసప్తమి పురస్కరించుకొని శుక్రవారం శ్రీఅక్కులమ్మ పేరంటాలు అమ్మవారి తీర్థ మహోత్సవం జక్కాన సూర్యనారాయణ, జక్కాన శ్రీరామ్మూర్తి, జక్కాన సూర్య వెంకటరావు, జక్కాన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పేరంటాల అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సాము గరిడీలు, చిటికెల భజనలతో ప్రదర్శించారు.

మండలంలోని బాటజంగాలపాలెం గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల వెంకటరమణ, కాపుశెట్టి వెంకట్, పందిరిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## 426 మందికి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-కశింకోట :** కసింకోట సచివాలయం-4 పరిధి జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక వైద్య అధికారి తిరుపతిరావు సమక్షంలో నిర్వహించారు. 426 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వికలాంగులకు వీల్ చైర్లు, 50 మందికి కళ్ళజోళ్ళు, సుమారుగా 300 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, జిల్లా జెసిఎస్ నోడల్ ఆఫీసర్ జగదీష్, ఎంపిహెచ్ఓ చుక్కల సత్యనారాయణ, సర్పంచ్ జయరజని, సెక్రటరీ రమేష్, వైద్యులు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక రోగాలపై అప్రమత్తం

**ప్రజాశక్తి-మునగపాక :** దీర్ఘకాలిక రోగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మూలపేట సర్పంచ్ బీసెట్టి గంగ అప్పల నాయుడు కోరారు. మండలంలోని మూలపేట గ్రామంలో శుక్రవారం జరిగిన 104 వైద్య సేవలను ఆయన పరిశీలించారు. పిహెచ్సీ వైద్యాధికారి విమలగిరి బీపీ, షుగరు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. పాఠశాల విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్ హెచ్‌పి యామిని ప్రియా, ఎఎన్ఎం రమణి, హెల్త్ అసిస్టెంట్ విశ్వనాథం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా దేవతమ్మ పండగ

**ప్రజాశక్తి -మునగపాక :** మండలంలోని నాగులపల్లి గ్రామంలో ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే మళ్ల కుటుంబీకుల దేవతమ్మ పండగ శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవతమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో మేళతాళాలు, సేవ గరిడీలు, కేరళ డప్పు వాయిద్యాలు, కోలాటాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో దేవతమ్మ ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దేవతమ్మను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### చట్ట ప్రకారం పరిహారం చెల్లించే వరకు

# భూముల జోలికి రావొద్దు



వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు, నాయకులు

**ప్రజాశక్తి -నక్కపల్లి:** నిర్వాశితులందరికీ పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పునరరావాసం కల్పించే వరకు భూములు జోలికి రావద్దని నిర్వాసితులు, నాయకులు తేల్చిచెప్పారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి నిర్వాసితుల సమస్యలు తెలుసుకునేందుకు పెండింగ్ చెల్లింపులకు ఏపీఐఐసీ అధికారులు శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు, నాయకులు మాట్లాడుతూ, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, రాజయ్యపేట గ్రామ పంచాయతీ పరిధిలోని 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి రూ.15 లక్షల ప్యాకేజీ చెల్లించాలని, నిర్వాసితులందరికీ ఆర్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయితీ పరిధిలో సర్వే నెంబర్లు 290,294, 295,297, 298, 299, 303, 304, 305,306/3,307/2,308, 309, 310/3, 311/2 భూమిలో గత 50 సంవత్సరాల నుండి జీడి తోటలు వేసుకుని, వచ్చిన ఫల సాయంతో జీవనం సాగిస్తున్నామ తెలిపారు. ఆ భూమికి సంబంధించి పరిహారం చెల్లించాలని, సర్వే నంబర్ 291లో 400 ఎకరాల ఉప్పుటేరుకు ప్యాకేజీ చెల్లించాలని, జిరాయితీ భూములతో సమానంగా డిఫారం, సాగు భూములకు 18 లక్షల చొప్పున నష్టపరహారం చెల్లించాలన్నారు. జీవో 268 ప్రకారం చెట్లకు నష్ట పరిహారం పెంచి చెల్లించాలని, డిఫారం, సాగు భూములలో చెట్లు కోల్పోయిన నిర్వాసితులకు కూడా నష్టపరిహారం చెల్లించాలని తెలిపారు. సర్వే నెంబర్ 288/2లో 19.20. సెంట్లు దేవుడు మాన్యం భూమికి పరిహారం చెల్లించి, జెట్టి ఏర్పాటు చేయాలని, పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఉన్న ఇల్లు, ఇండ్ల స్థలాలన్నింటిని గ్రామకంఠంగా గుర్తించి పరిహారం చెల్లించాలని, ప్రజలకు హాని కలిగించే పరిశ్రమలను ఏర్పాటు చేయవద్దని కోరారు. ఈ మేరకు ఏపీఐఐసీ డిటి రాజు, కిరణ్ కుమార్ లకువినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం,అప్పలరాజు, గ్రామస్తులు పీక్కి దేవుడు పీక్కి తాతిలు,పిక్కి సత్తియ్య , పిక్కి గంగరాజు, పిక్కీ కోదండరావు, వాసుపల్లి శివ పాల్గొన్నారు.



హాజరైన నాయకులు

## లోకేష్ పర్యటనను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - మాడుగుల:** మండలంలోని ఘాటీ రోడ్డు జంక్షన్ వద్ద ఈనెల 20న లోకేష్ పర్యటనను జయప్రదం చేయాలని టిడిపి, జనసేన శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు అద్దిపల్లి జగ్గారావు, జనసేన మండల అధ్యక్షుడు గర్రెడ్డి శివాజీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి పంచాయతీ ఓటర్ లిస్ట్ పరిశీలన చేసి దొంగ ఓటర్లను తొలగించేందే విధంగా చూడాలన్నారు. మండలంలో వైయస్సార్ పార్టీ నుంచి వస్తున్న కార్యకర్తలని చేర్చుకోవాలని, మండల పార్టీకి సమాచారాన్ని పంపాలని తెలిపారు.ఈ సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఉండూరు దేవుడు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, మండల పార్టీ ఉపాధ్యక్షులు బుద్దల రమణ, పార్టీ మాజీ కార్యదర్శి నందారపు సన్యాసిరావు, తెలుగు యువత అధ్యక్షులు వడ్డీ రాజ్ కుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ మరువాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

## ఘనంగా అడవిరాజులబాబు పండుగ

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలో శుక్రవారం పలు గ్రామాల్లో అడవిరాజులబాబు పండుగను ఆయా గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. చీడిగుమ్మల, ఎర్రవరం, యరకంపేట, పోలవరం, నల్లంకి, కంఠారంలోని అడవిరాజులబాబులను ఉదయం నుంచి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎస్సై కృష్ణారావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న నాగేశ్వరరావు

## కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** మున్సిపాలిటీ బలిఘట్టం 17వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన ముత్యాల అప్పారావు(బుజ్జి) నోటి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడబండ నాగేశ్వరరావు(జిఎన్ఆర్) తన సొంత నిధులు 10వేలను శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు.



సాయం చేస్తున్న విద్యార్థులు

## విద్యార్థుల సాయం

**ప్రజాశక్తి-మాకవరపాలెం:** మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు తోటి విద్యార్థులు సాయం అందించారు. పాఠశాలలో చదువుతున్న దినేష్, హిమజయలకు తోటి విద్యార్థులు వెంకటమోహన్, శ్రీలత, కృష్ణవేణి, సాయి గణేష్ దివ్య, తేజస్విని, ఉమామహేంద్ర, తేజ 10 కేజీల బియ్యం, గోధుమపిండి, ఉప్మానూక, గోధుమ రవ్వ, ఆయిల్ ప్యాకెట్, సబ్బులు, మరికొన్ని సరుకులను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం రాము, ఉపాధ్యాయులు అభినందించారు.

## భూముల ఆన్‌లైన్‌కు వినతి



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న బాధితులు

**ప్రజాశక్తి -కోటవురట్ల:** పందూరు శివారు బంద ప్రాంతం వద్ద తమకు ప్రభుత్వం 1988లో అందజేసిన భూములు ఆన్లైన్ చేయాలంటూ తహసిల్దార్ వెంకటరమణకు కార్యాలయంలో శుక్రవారం బాధితులు చిటికల కొండ, షేక్ సిద్ధ, బండారు కొండ, పెట్ల లోవలక్ష్మిలు మొరపెట్టుకున్నారు. 1988 నుండి సర్వే నెంబర్ 431లో సుమారు 35 సంవత్సరాల పాటు పొలంపై ఆధారపడి జీవిస్తున్నామని, గత రెవెన్యూ అధికారులు 2018లో తమ పట్టాలు రద్దు చేయడంపై అనేకమార్లు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిని తమ పేరున ఆన్లైన్లో నమోదు చేయలేదని తెలిపారు.బాధితులకు న్యాయం చేయాలని మండల టిడిపి నాయకులు జానికి శ్రీను, పందూరు మాజీ సర్పంచ్ నారాయణరావు, పొందూరు టిడిపి నాయకులు సత్తిబాబు కోరారు. స్పందించిన తహసిల్దార్ సమగ్ర దర్యాప్తు (విచారణ) చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి తగు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.





పరిశీలిస్తున్న తహశీల్దార్

## పోలింగ్ బూత్‌ల్లో తనిఖీలు

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని జోగుంపేట, పాతమల్లంపేట, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లోని పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహశీల్దార్ ప్రభాకర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఎలక్ట్రికల్, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జోగుంపేట సచివాలయ వీఆర్వో గోవర్ధన్, గొలుగొండ వీఆర్వో రాజబాబు, విఆర్ఎలు పాల్గొన్నారు.

# 642 మందికి జగనన్న గృహాల రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న తహశీల్దార్

**ప్రజాశక్తి -కోటవురట్ల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న గృహాల శాశ్వత హక్కు నిమిత్తం చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తహసిల్దారు వెంకటరమణ తెలిపారు. మండల వ్యాప్తంగా 25 గ్రామ పంచాయతీలకు గాను 824 మంది లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పించాల్సి ఉండగా శుక్రవారం నాటికి 642 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. అత్యధికంగా బోడపాలెంలో 111 మందికి రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా 23 మందికి రిజిస్ట్రేషన్లు, పాములవాక 89కి 46, కైలాస పట్నం 61కి 46, పందూరు 41కి 28 రిజిస్ట్రేషన్లు జరిపినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా లింగాపురంలో 27 మంది లబ్ధిదారులు ఉండగా సర్వే నంబరు తప్పుగా చూపించడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అన్నవరం, వెంకటాపురం, రామచంద్రపాలెం, బికె పల్లి గ్రామాలలో నివాసయోగ్యం కానీ ప్రాంతాన్ని కేటాయించడంతో జగనన్న గృహ లబ్ధిదారులు ఆశక్తి చూపలేదు.



ఫిర్యాదు చేస్తున్న టిడిపి, బిజెపి ఇతర నాయకులు...

## సిటీ క్లబ్ నిర్మాణాలపై విచారణ

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** స్థానిక సిటీ క్లబ్ అక్రమ నిర్మాణాలపై సోమవారం స్పందన కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదుపై కదలిక వచ్చింది. దీనిపై విచారణ చేయాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, గత నెల 30న ఈ నిర్మాణాలపై మొదటి నోటీసు ఇచ్చామని, మరలా ఈ నెల 8వ తేదీన రెండవ నోటీసు ఇచ్చామన్నారు. అప్పటినుండి సమాధానం ఇవ్వడానికి 15 రోజులు సమయం ఉంటుందన్నారు. అప్పటికి సమాధానం రాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ వ్యవహారంపై తహసిల్దార్ ను విలేకరులు సంప్రదించగా, సిటీ క్లబ్ లో నిర్మాణాలపై స్పందన లో వచ్చిన ఫిర్యాదును పరిశీలించామని, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ స్థలం గ్రామకంఠంగా నమోదై ఉందన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామన్నారు.

## కొత్తకోటలో తాగునీటికి ఇక్కట్లు

**ప్రజాశక్తి -కొత్తకోట:** రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో గత నాలుగు రోజులుగా తాగునీటికి పలు వార్డుల ప్రజలు అవస్థలు పడుతున్నారు. 6,7,10,11,12 వార్డుల్లో పంచాయతీ కొళాయిల నుంచి నీరు సరఫరా కాలేదు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగు నీటి కోసం దూరంగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారు. జల జీవన్ మిషన్ లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆ పైపులైన్ కనెక్టివిటీని ఒక ప్రాంతానికి చేసి మిగతా ప్రాంతాలకు కలపక పోవడంతో చాలా వార్డులకు తాగు నీరు రాలేదు.పైగా గతంలో సరఫరా చేసే పైపులైన్ తొలగించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. నాలుగు రోజులైనా పాలకులు, అధికార్లు కనీసం స్పందించ లేదని పలు వార్డుల ప్రజలు విమర్శిస్తున్నారు.



నీరు రాని కుళాయి

## ఎంపిడిఒకు ఫిర్యాదు

**ప్రజాశక్తి -కొత్తకోట:** రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోట మార్కెట్ యార్డ్ స్థలంలో పంచాయితీ తీర్మాణాలు, వేలం పాటలు లేకుండానే పలువురు వ్యాపారులు శాశ్వత కట్టడాలు చేపడుతున్నారని కొత్తకోట గ్రామానికి చెందిన టిడిపి, బిజెపి నాయకులు పలువురు ఎంపిడివో బానోజీరావుకు శుక్రవారం పిర్యాదు చేశారు. ఇటీవల మార్కెట్ యార్డును నా బార్డు నిధులతో అభివృద్ధి చేసి పాత మార్కెట్‌ను అక్కడికి తరలించారు. పంచాయితీ పాలకులు ప్రభుత్వానికి ఆదాయం లేకుండా ఒక్కో వ్యాపారి నుంచి మామూళ్లు ఆశించి, స్థలాలను ఇష్టారీతిగా ఇచ్చేస్తున్నారని. దీంతో సదరు వ్యాపారు లు ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ స్థలంలో శాశ్వత కట్టడాలు చేపడుతున్నారని ఆ పిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం విచారణ చేసి ప్రభుత్వానికి, పంచాయితీకి ఆదాయం వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి, టిడిపి నేతలు రాజేశ్వరరా వు, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, వెల్లంకి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యరంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత

## -ఎంపి వెంకట సత్యవతి-ఏరియా ఆసుపత్రిలో 50 పడకల భవనం ప్రారంభం

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**స్థానిక ఏరియా ఆసుపత్రిలో రూ.8.85 కోట్లతో నూతనంగా నిర్మించిన 50 పడకల భవనం(వైయస్సార్ భవన్)ను అనకాపల్లి ఎంపి భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి సత్యవతి మాట్లాడుతూ, ప్రభుత్వం వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ ఎటువంటి అవినీతికి తావు లేకుండా వైద్య వ్యవస్థను రూపొందిస్తుందన్నారు. ఇచ్చిన మాట మేరకు 17 కొత్త మెడికల్ కళాశాలలు ప్రారంభోత్సవం చేసి 2023లో ఐదు మెడికల్ కళాశాలలు పూర్తి చేసి తరగతులను ప్రారంభించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. 6వ వార్డు, బలిఘట్టంలో రూ.2.18కోట్లతో రెండు అర్బన్ పీహెచ్‌సి భవనాలు ప్రారంభించామన్నారు. నాతవరం మండలంలో గునుపూడి 20లక్షలతో పిహెచ్‌సీ భవనం, నాతవరం మండల కేంద్రంలో రూ.1.60 కోట్లతో పిహెచ్‌సి భవనం ప్రారంభించామన్నారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో రూ.1.35కోట్లతో పీహెచ్‌సి భవనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చీడిగుమ్మలలో రూ.1.25లక్షలతో పిహెచ్‌సిని ప్రారంభించామన్నారు. మాకవరపాలెం మండలంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ ఛైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు ఏకా శివ, మున్సిపాలిటీ జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, ఎంపిపి సుర్ల రాజేశ్వరి, సీనియర్ నాయకులు బోళెం నర్సింహమూర్తి, ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ నీలవేణి, డాక్టర్ రాజశేఖర్‌తో పాటు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్‌ర్ భవన్‌ను ప్రారంభిస్తున్న ఎంపి సత్యవతి, ఎమ్మెల్యే గణేష్

## తహాశీల్దార్‌గా జయలక్ష్మి బాధ్యతల స్వీకరణ



**ప్రజాశక్తి -ఎస్.రాయవరం:**మండల తహాశీల్దారుగా వై. జయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంఛార్జ్ డిప్యూటి తహాశీల్దార్ శ్యాం కుమార్ నుండి ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి రాయవరం మండల తహాశీల్దారుగా బదిలీపై వచ్చారు. రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## వైఎస్ఆర్ యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా నాయుడు

**ప్రజాశక్తి-మాకవరపాలెం:**మాకవరపాలెం మండలం లచ్చన్న పాలెం గ్రామానికి చెందిన కన్నూరి నాయుడు అనకాపల్లి జిల్లా వైయస్సార్ యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికైనట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పార్టీ నుంచి ఆయనకి అదేశాలు శుక్రవారం అందినట్టు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ మరింత ఉన్నత స్థాయికి ఎదిగేలా తన వంతు కృషి చేస్తానని నాయుడు అన్నారు. ఆయనను పలువురు వైసీపీ నాయకులు అభినందించారు.




అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

## ఇవిఎంలపై అవగాహన

**ప్రజాశక్తి-రావికమతం:** మండలంలోని కవగుంట ఎంపీయుపీ పాఠశాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఇవిఎం)లపై ప్రజలకు మండల రెవెన్యూ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఓటు వేసే ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగాసర్పంచు దాసరి సూర్య కుమారి మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్ మిషన్లపై ఓటు వేసే ప్రక్రియపై అవగాహన లేక పలువురు ఓటు వేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సతీష్, వీఆర్‌ఏ శ్రీను, స్కూల్ కమిటీ ఛైర్మన్ నాయుడుబాబు పాల్గొన్నారు.

## వైసిపి అనుబంధ విభాగాల్లో నియామకం

**ప్రజాశక్తి -కోటవురట్ల:**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగంలో మండలం నుండి పలువురు నియామకం అయ్యారు. జిల్లా మహిళా విభాగపు సహాయ కార్యదర్శిగా మాజీ జడ్పీటిసి సభ్యురాలు వంతర వెంకటలక్ష్మిని, పాయకరావుపేట నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా చామంతుల శ్రీనివాసరావులను నియమించారు. వీరి నియామకం పట్ల మండలంలో పలువురు అభినందనలు తెలిపారు.



శుభాకాంక్షలు చెపుతున్న అయ్యన్న, అనిత

## వినోద్‌రాజు జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం:**మండలంలోని పెద్ద గుమ్ములూరు గ్రామంలో మాజీ ఎంపీపీ, రాష్ట్ర పంచాయతీ ఛాంబర్ ఉపాధ్యక్షులు మేజర్ల వినోద్ రాజు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇంటి వద్దకు టిడిపి, జనసేనపార్టీ నాయకులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, మాజీ గ్రంధాలయ తోట నాగేష్, మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్దం మాజీ మండల నల్లపురాజు వెంకటపతి రాజు తదితరులు ఉన్నారు.

# భారీ క్వారీ వాహనాలను నిలిపివేయాలి

### తహాశీల్దార్‌కు ఆదివాసీల వినతి

**ప్రజాశక్తి -కొత్తకోట:**నల్ల క్వారీ నుంచి రాయిని తరలిస్తున్న భారీ వాహనాలను నిలుపు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గుడ్డిప శివారు పెరగోట్టుపాలెం గ్రామ ఆదివాసి గిరిజనలు రావికమతం తహసీల్దార్ రమణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మూలపర్తి నూకాలమ్మ, వరహాలమ్మ, చింతలమ్మ తదితరులు మాట్లాడుతూ, గ్రామంలో కొండదొర తెగ చెందిన 12 మంది కుటుంబాలు ఉన్నాయన్నారు. మరపాక రెవిన్యూ పరిధిలో నల్ల రాయి క్వారీ నుండి భారీ వాహనాలు పేరుగోట్టి పాలెం మీదుగా రోడ్డు పై నుండి గొంప జంక్షన్‌కి రోడ్డు మార్గంగా తీసుకు వెళ్త న్నాయని తెలిపారు. తాము సొంతంగా ఏర్పాటు చేసుకున్న రోడ్లను భారీ వాహనాలు తిరగడంతో ధ్వంసం అవుతున్నాయని వాపోయారు. పంట పొలాలు దుమ్ము ధూళితోమా దర్శనం ఇస్తున్నాయని, పిల్లలు స్కూల్ కి వెళ్లాలంటే భయం భయంగా ఉందన్నారు. గత ఏడాది రోడ్డు నిర్మాణం చేసుకొనేందుకు ఇంటికి వెయ్యి రూపాయలు చందాలు వేసుకొని రోడ్డు గోతులు పూడ్చుకున్నామన్నారు. క్వారీ భారీ వాహనాలు తిరగడంతో రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీ యజమాని పై చర్యలు తీసుకుని వాహనాలను నిలుపు చేయాలని కోరారు...



వినతిపత్రం అందజేస్తున ఆదివాసీలు




కోటవురట్లలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

## జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

**ప్రజాశక్తి -కోటవురట్ల:** మండలంలోని రామచంద్ర పాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సుమారు 393 మంది రోగులకు డాక్టర్ సంతోష్ కుమార్ వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలో కొల్లు దుర్గ ప్రసాద్ అనే వికలాంగునికి ఎంపీటీసీ రాంబాబు, వైసీపీ సీనియర్ నాయకులు కన్నబాబు వీల్ చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరం:**స్థానిక గ్రామ సచివాలయం అవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2 ను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ ఎస్ వి శక్తి ప్రియ, వైస్ ఎం.పి.పి బొలిసెట్టి గోవింద్ ప్రారంభించారు.359 మంది రోగులను తనిఖీ చేశామని శక్తిప్రియ తెలిపారు.ఇద్దరినీ అనకాపల్లి ఎన్.టి.అర్. ఆసుపత్రికి రిఫర్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అబివృద్ధి అధికారి ఎస్. సత్యనారాయణ, వైద్య నిపుణులు జయలక్ష్మి, ముర్తాజ్, ఆరోగ్య విస్తరణ అధికారి టి.నాగేశ్వరరావు ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా మెగా వాలీబాల్ టోర్నమెంట్

**ప్రజాశక్తి-జి.మాడుగుల:** జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ఆదేశాల మేరకు మద్దిగరువులో యువహెూ మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఏఎస్పి ధీరజ్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఉచితంగా నడిపి స్తున్న బస్ ను మద్దిగరువు నుండి బోయితీలి వరకు పెంచారు. ఈ బస్‌కు ఎఎస్పి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. తదనంతరం బస్‌లో ఆయన మద్దిగరువు వరకు ప్రయాణించి, సురిమెట్ల గ్రౌండ్లో యువహెూ మెగా వాలీబాల్ టోర్నమెంట్ను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ కు మొత్తం 59 టీమ్స్ పాల్గొనాయి, విన్నర్‌గా లింగేరిపుట్టు టీం, రన్నర్‌గా ఎగవ మండిబ టీములు నిలిచాయి.